పుస్తక పరిచయం

# అంబల్ల జనార్దన్ కథలు

రచన: అంబల్ల జనార్దన్

టీవీని తయారు చేయాలంటే రోజూ టీవీ చూస్తే చాలదు. ఆ విషయమై అవగాహన ఉన్నవారివద్ద శిక్షణ పొందాలి. లేదా అలాంటివారు రాసిన పుస్తకాలు చదవాలి.

మనం ముంబై వెళ్ళిరావచ్చు. కోకోకోలా తాగొచ్చు. బొమ్మలో, తువాళ్ళో అమ్మే బాలవ్యాపారులను రోడ్డుమీద చూసుండొచ్చు. బీడీలు చుట్టడం బ్రతుకుతెరువైనవారి బిడ్డలు మన స్నేహితుల్లోఉండొచ్చు. మన చుట్టూ ఉన్న ప్రపంచంలోని ఆచారవ్యవహారాలు, మంచిచెడ్డలు, బరువు బాధ్యతలు, కష్టసుఖాలు వగైరాలను- కళ్ళారా చూస్తూ వాటి లోతులు అంచనా వేస్తూండొచ్చు. అన్నింటి గురించీ మనకు తెలుసనిపిస్తుంది- 'అంబల్ల జనార్దన్ కథలు' చదివేదాకా.

సమకాలీన ప్రపంచంలో సగటుమనిషి తెలుసుకోవాల్సిన నిజాలనెన్నో పొందుపర్చిన ఈ కథల్లోని ప్రత్యేకత నిజాయితీతో కూడిన విశ్లేషణ. మొత్తం 41 కథలుంటే వాటికి కథ కాని కథగా జతపడిన రచయిత స్వీయచరిత్ర (కష్టేఫలి: పాతాళం నుంచి పైపైకి...) యువతరానికి ప్రేరణ.

ఈ కథల నేపథ్యం ఎక్కువగా తెలంగాణాకు పరిమితమైనా- ఎల్లలెరుగని భాషాభిమానంతో పాటుభాషాతీతమైన భారతీయత అంతర్లీనం కావడం రచయిత విశాల దృక్పథానికీ, మానసిక పరిణతికీ, రచనా సామర్థ్యానికీ నిదర్శనం. అవగాహన పెంచే ఇలాంటి కథలు విద్యాసంస్థల్లో పాఠ్యాంశాలుగా కనిపించడం అరుదైనా జీవితమనే బడిలో ఛాయిస్ మనదే కాబట్టి ప్రతిఒక్కరూ ఈ పుస్తకాన్ని

చదివి తీరాలన్నది స్వాభిప్రాయం. కథలతోపాటు ఇమిడిన- శ్రీ బి.యస్. రాములు ముందుమాట, ఆచార్య డా. ఎన్. గోపి ఆప్తవాక్యం, శ్రీ పోరంకి దక్షిణామూర్తి, డా. మంతెన, శ్రీమతి బీనాదేవి ల సమీక్షలు పాఠకులకు ప్రయోజనాత్మకం.

చాలా కథల్లో కథనం అద్భుతమనిపిస్తుంది. వాటిలో పట్టాభి‘షోఖం’, సమ్(?)బంధాలు, వ్యసనం, వైశాల్యం, బంధం, విఆర్‌యస్ అను స్వఛ్ఛంద పదవీ విరమణ, ఆకాశం అంచుల్లోకి, పసికూనలు-ప్రచారవీణ, తెలుగువాళ్ళు, ఇనుము-సుత్తి మరింత ప్రత్యేకం. సానబెట్టాల్సిన వజ్రాలనిపించేవి కొన్ని ఉన్నాయి. మిగతా కథల స్థాయి దృష్ట్యా- జాతకం, ద్వంద్వనీతి, భూమి గుండ్రంగానే ఉంది నిర్ఘుం, చివరకు మిగిలింది పేలవమనిపిస్తాయి. తెలుగువాళ్ళు, బాస్- మా కథలు ‘తెలుగోడు’, ‘బాస్’ ల ఇతివృత్తాలను మరో కోణంలో ప్రదర్శించడం విశేషం. సాహితీవైద్యం పాఠకుల ప్రయోజనానికై ఈ పుస్తకంనుంచి నాలుగు కథలను ఎంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్నాం.

**పట్టాభి‘షోఖం’:** రామయ్య ఉన్న ఊళ్ళో మగ్గం నేయడం ఇష్టంలేక బొంబాయి వెళ్ళి బట్టలమిల్లులో వీవర్ అయ్యాడు. పూనావాలా చాల్లో ఆయన మకాం. తన జీతం నెలకు ముప్పై రూపాయలైతే భార్య శాంతమ్మ బీడీలు చేసి మరో పది రూపాయలు సంపాదించేది. ముందుచూపుతో కుటుంబాన్ని ముగ్గురు పిల్లలకు నియంత్రించాడు. దురలవాట్లకు లోనుకాకుండా గుట్టుగా సంసారం నడిపి కూతురి పెళ్ళి చేసాడు. పెద్దకొడుకు పట్టాభి మంచిబాలుడిలా పెరిగిపెద్ద బీకాం ప్యాసయ్యాడు. కష్టపడి బ్యాంకు ఆఫీసరయ్యేక తలిదండ్రుల బలవంతం మీద మృదులను పెళ్ళి చేసుకున్నాడు. సాటి ఉద్యోగుల్లో చిన్నతనంలేకుండా అన్ని హంగులూ ఉన్న ఓ ఫ్లాట్ తీసుకున్నాడు. ఆ ఇల్లు మిల్లుకి దూరమని తండ్రీ, ఇంజనీరింగు కాలేజికి దూరమని తమ్ముడూ రానంటే కొత్త దంపతులకు సాయంగా శాంతమ్మ మాత్రం వచ్చి కొద్దిరోజులు కోడలికి కోచింగిచ్చి

వెళ్ళిపోయింది. కొన్నాళ్ళు ఆ దంపతులు ఆ ఇంట్లో రాజూ రాణీల్లా రాజ్యమేలారు. కానీ పట్టాభికి ఆఫీసు రెండుగంటలదూరం కావడంవల్ల మృదుల అక్కడ ఒంటరిదైపోయింది. ఇరుగుపొరుగులు అంతస్థులో ఎక్కువ. గృహప్రవేశానికొచ్చిన పట్టాభి బంధువుల్ని చూసి వారతణ్ణి తక్కువగా అంచనా వేసి అంటీముట్టనట్లుండేవారు. పూనావాలా చాలాలో అతడికి గౌరవమూ, ప్రేమా రెండూ లభించినా- తన హోదా, సాటివారిలోతన పరువూ, బొత్తిగా ప్రైవసీ లేకపోవడం, లెట్రిన్ కొరకు క్యూ- మనసులోకి వచ్చి అతడి ఆలోచనలను అడ్డుకున్నాయి. ఈ సందిగ్ధం అతడికి శోకకారణం కాగా- పరిష్కారం పాఠకులను సూచించమని కోరుతూ కథను ముగించారు రచయిత.

**విశ్లేషణ:** చాలా లోతైన కథ. కథనంలో తనకే ప్రత్యేకమనిపించే శైలిని వాడారు రచయిత. ఏ పాత్రకూ ప్రత్యేకత లేకపోయినా ప్రతిపాత్రా పాఠకుల హృదయాలకు హత్తుకుపోతుంది. అందుకు కారణం ఆ పాత్రలు కరడుగట్టిన వాస్తవాలనుంచి ఉద్భవించడమే. పేదరికంనుంచి బయటపడి సంపన్నదిశగా వెడుతున్న పట్టాభులిప్పుడు కోకొల్లలు. వారి సందిగ్ధాన్ని సూటిగా పాఠకుల ముందుంచి పరిష్కారాన్ని వారికే విడిచిపెట్టడం రచయిత లౌక్యానికి ఉదాహరణ.

**బంధం:** మామిడికుదురు వాసి రఘు డిగ్రీ చదివిన నిరుద్యోగి. తలిదండ్రులు, వ్యవసాయం చేసే అన్న, ఇంకా పెళ్ళికాని ఇద్దరు చెల్లెళ్ళు చిన్నబుచ్చుతూంటే భరించలేక పాట్నాకు పారిపోయాడు. అక్కడ మాతాప్రసాద్ దంపతులతణ్ణి ఆదుకుని తమ హోటలుకి మేనేజర్ని చేసి కుటుంబంలో మనిషిలా చూసుకుంటారు. రఘు అక్కడే స్థిరపడి తనవారికి డబ్బు పంపుతూంటాడు. తండ్రికి అనారోగ్యం చేసిందని ఇంటికివెడితే అతణ్ణి అంతా గౌరవించి మర్యాద చేస్తారు. అనుభవం వచ్చింది కాబట్టి తమవద్దనే ఉండిపోయి వ్యాపారం చేసుకోమంటారు. తన వారిది స్వార్థపూరిత బాంధవ్యమనీ, మాతాప్రసాద్

దంపతులూ స్వార్థానికి అతీతులు కాకపోయినా వారి బంధంలో ఇమిడిన ప్రేమపాశమే తనకు హాయినిస్తుందనీ అనుకుంటాడతడు.

**విశ్లేషణ:** రక్తసంబంధంలో సెంటిమెంటుకి సంబంధించిన స్వార్థముంది. ఆ స్వార్థంనుంచి బయటపడాల్సిన అవసరాన్ని సూచించే ఈ కథలో పాత్రలన్నీ సజీవాలు. స్వపర భేదాలెన్నకూడదన్న శ్రీకృష్ణపరమాత్మ గీతోపదేశాన్ని జీవన సంగ్రామానికి అన్వయించిన ఈ కథలోని సందేశం గొప్పది. పాత్రలపట్ల అవగాహనే తప్ప దురభిప్రాయం లేని రచయిత పరిణతీ గొప్పది.

**జాతకం:** మంజూషకు పెళ్ళిచూపులు. వరుడు శ్రీపాదది టూరింగు జాబ్ అని ఆమె అంతగా ఇష్టపడలేదు. జాతకాలు కలిసాయనీ, సంబంధం మంచిదనీ తలిదండ్రులు నొక్కిస్తే అయిష్టంగానే ఒప్పుకుంది. పెళ్ళయ్యేక దంపతులు శృంగారయాత్రకు వెళ్ళారు. ఆ తర్వాత శ్రీపాదకు ఎయిడ్సు రోగమున్నట్లు బయటపడింది. పిల్లలు వద్దని తగు జాగ్రత్తలు తీసుకున్న మంజూషకు ఆ వ్యాధి ఇంకా సోకలేదు. శ్రీపాద తండ్రి కృష్ణమూర్తి జరిగినదానికి నొచ్చుకుని తను తీసుకున్న కట్నం వెనక్కిచ్చేస్తానంటాడు. మంజూషకు విడాకులిప్పిస్తాననీ, ఆమెను కన్న కూతుర్లా చూసుకుని జీవితంలో తన కాళ్ళమీద తాను నిలబడేలా చేస్తాననీ, తగిన వరుణ్ణి ఎన్నుకుంటే తనే పెళ్ళి చేసి ప్రాయశ్చిత్తం చేసుకుంటాననీ అంటాడు.

**విశ్లేషణ:** కథ పేరును బట్టి ఇతివృత్తం జాతకాలను నిరసించడానికని అనుకోవచ్చు. కానీ కృష్ణమూర్తి ఔదార్యంతో అంతమైన ఈ రచన ఎక్కడో మొదలై ఎక్కడో ముగిసి- ఇది కథ కాదు- వాస్తవ సంఘటనకు దినపత్రికలిచ్చే తరహా అక్షరరూపం అనిపిస్తుంది.

**చివరకు మిగిలింది:** నరేంద్రకు ఆఫీసు ఎల్టీసీ సదుపాయమిచ్చింది. భార్య వద్దంటున్నా వినక తలిదండ్రుల్నీ, తమ్ముణ్ణీ, చెల్లెల్నీ కూడా వెంటబెట్టుకుని దక్షిణ

భారత యాత్ర చేసాడతడు. తల్లి సంతోషిస్తుందనుకుంటే దైవ దర్శనానికి బదులు ఎక్కువగా చెట్లూ చేమలూ చూడ్డానికి వళ్ళు హూనం చేసుకోవడంకంటే ఇంటిపట్టున ఉండడమే మేలు అన్నదామె. అత్తాకోడళ్ళ మధ్య సామరస్యానికి బదులు వైషమ్యాన్ని పెంచిన ఆ ప్రయాణంలో స్వార్థం, పరమార్థం రెండూ దక్కలేదని బాధపడిన నరేంద్ర ఇకమీదట తలిదండ్రుల్ని వేరే యాత్రా స్పెషల్లో పంపి తరాల అంతరాలు పోటీ పడకుండా చేయాలనుకున్నాడు.

**విశ్లేషణ:** ఇతివృత్తం లోతైనది. సందేశం గొప్పది. సమకాలీనులకు ప్రయోజనాత్మకం. రెండు పేజీల్లో కాక నాలుగైదు పేజీలకైనా విస్తృతం చేస్తే ఈ కథకు సంపుటిలోని ఇతర ఉత్తమకథల పక్కన చోటుండేది.

() () () () ()